# ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY



## రాజన్న సిరిసిల్ల

3★★★ జిల్లా వార్తలు

ఆదివారం 15 సెప్టెంబరు 2024


# పత్తి రైతు పరేషాన్

- దిగుబడిపై దిగాలు
- అధిక వర్షాలతో ఎర్ర బారుతున్న పంట
- వెంటాడుతున్న కలుపు సమస్య
- జిల్లాలో 49,332 ఎకరాల్లో పత్తి సాగు

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

పత్తిపంట సాగు చేసిన రైతులు తెల్లబోతున్నారు. సీజన్ ఆరంభంలో వర్షాలు ముఖం చాటేసి రైతులను ఆందోళనకు గురిచేశాయి. విత్తనాలు చల్లుకున్నా మొక్క ఎదుగుదల లేక ఆవేదనకు గురయ్యారు. అనంతరం వర్షాలు ఆశాజనకంగా కురవడంతో పత్తి పంటకు జీవం పోసినట్లయ్యింది. అయితే తుఫాను ప్రభావంతో కురిసిన అధిక వర్షాలు జిల్లాలోని పత్తి రైతులను పరేషాన్ చేస్తున్నాయి. భారీ వర్షాలతో పంట దెబ్బతిని దిగుబడిపై ప్రభావం చూపింది. మరోవైపు తెగుళ్ల మొదలు కావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆకులకు తెగుళ్ల సోకి ఎర్ర రంగులోకి మారుతున్నాయి. పంట చేలల్లో నీళ్ల నిలిచి తడి ఆరకపోవడంతో మొక్కలు పాడవు తున్నాయి. ఎదిగే దశలో పత్తి పంటకు నష్టం వాటిల్లుతోంది.

### ఆందోళనలో రైతులు

జిల్లాలో 2.32 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేయగా పత్తి 49,332 ఎకరాల్లో సాగు చేశారు. గంభీరావుపేటలో 220 ఎకరాలు, ఇల్లంతకుంట 12,412, ముస్తాబాద్ 760, సిరిసిల్ల 720, తంగళ్లపల్లి 1300, వీర్నపల్లి 514, ఎల్లారెడ్డిపేట 3900, బోయినపల్లి 6795, చందుర్తి 5800, కోనరావుపేట 4601, రుద్రంగి 3200, వేములవాడ 5100, వేములవాడ రూరల్‌లో 3950 ఎకరాల్లో పత్తి చేశారు. అధిక వర్షాలతో పంట కొట్టుకుపోవడం, ఆశించిన స్థాయిలో పంట ఎదుగుదల లేకపోవడం, పూత, కాత దశలో పంట ఉండడంతో ఆందోళన చెందుతున్నారు. ఖర్చులు ఒకవైపు పెరిగిపో తుం డగా కలుపు సమస్య వెంటాడుతోంది. కలుపు పెరగడంతో వాటిని తొలగించుకోవడానికి చేళ్లల్లోకి వెళ్లలేని పరిస్థితి కూడా ఉంది. ఇప్పటికే ఎకరానికి రూ.40 వేలకు పైగా ఖర్చు చేసిన రైతులు కలుపుకోసం అదనంగా ఖర్చు చేయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. వర్షాల కారణంగా కనీసం ఒకటికి రెండు సార్లు మందులు పిచికారి చేయాల్సి ఉందని తెలుపుతున్నారు. మొక్కలో బలం లేక దిగుబడి పూర్తిగా తగ్గిపోతోందని భావిస్తున్నారు.



రుద్రంగిలో వర్షాలకు దెబ్బతిన్న పత్తి

### పెట్టుబడి వచ్చేట్టు లేదు



**- సద్ది సురేందర్‌రెడ్డి, రైతు ఎల్లారెడ్డిపేట**

నాకున్న 12 ఎకరాలతోపాటు మరో 8 ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని పత్తి పంటను సాగు చేశా. ఎకరానికి రూ.30 వేల చొప్పున మొత్తం రూ.6 లక్షలు పెట్టుబడికి ఖర్చయ్యాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పత్తి పంటలో కలుపు మొక్కలు విపరీతంగా పెరిగాయి. చేనంతా ఎర్రబడిపోయింది. పెట్టుబడి వచ్చేట్టు లేదు.

### చేనంతా ఎర్రబారింది

**- చెరుకు ఎల్లయ్య, రైతు, దుమాల, ఎల్లారెడ్డిపేట**



గ్రామ శివారులోని నాకున్న 2 ఎకరాల విస్తీర్ణంలో పత్తి పంట సాగు చేశా. దుక్కులు దున్నింది మొదలు ఇప్పటి వరకు మొత్తం రూ.80 వేలు పెట్టుబడులకు అయ్యాయి. ఇటీవల కురిసిన వానలకు పొలమంతా వరద నీరు చేరింది. రెండు రోజులకు తేలింది. నీళ్లకు మొక్క ఆకులు ఎర్రబడి ఎదుగుదల లేకుండాపోయింది. పత్తి చేనును బతికించుకునేందుకు మళ్లీ రూ.10 వేలు అప్పు చేసి మందులను పిచికారి చేస్తున్నా.

### వర్షాలతో పంట దెబ్బతిన్నది



**- గుగులోత్ రాజు, రైతు, బండితండా**

ఇటీవల కురిసిన వర్షలకు పత్తి పంట పూర్తిగా దెబ్బతిన్నది. రెండు ఎకరాల్లో పత్తి పంట వేశాను. అధిక వర్షాలతో పత్తి ఆకులు ఎర్రగా మారి పిందెలు రాలిపోతున్నాయి. పంటలు నష్ట పోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

### పత్తి చేనులో కలుపు పెరిగింది

**- వజ్జెపల్లి రమేష్, కేశన్నపల్లె**



అధిక దిగుబడి వస్తుందని భారీగా పెట్టుబడులు పెట్టి పత్తి సాగు చేస్తే అధిక వర్షాలకు ఎర్రబడింది. కలుపు కూడా విపరీతంగా పెరిగింది. వారం రోజుల పాటు వరుసగా వానలు పడడంతో చేనులోకి నీళ్ల చేరి అడుగు పెట్టే అవకాశం లేకుండా పోయింది. చౌక భూముల్లో పత్తి ఎర్రబడడం కొంత తక్కువగా ఉన్నా రేగడి భూముల్లో ఎక్కువగా ఉంది. ఈ సారి పెట్టుబడులు వచ్చే పరిస్థితి లేదు.



నిర్వాహకులకు సూచనలు ఇస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

## గణేశ్ నిమజ్జనానికి భారీ బందోబస్తు

- జిల్లా వ్యాప్తంగా 2,200 వినాయక విగ్రహాలు
- నిర్దేశించిన సమయానికి నిమజ్జనం పూర్తి చేయాలి
- శోభాయాత్రలో డీజేలకు అనుమతిలేదు - ఎస్పీ అఖిల్ మహాజన్

- 6లో..

## ఘనంగా లక్ష్మీగణపతి మహా పూజ



మహాపూజ నిర్వహిస్తున్న అర్చకులు

వేములవాడ, సెప్టెంబరు 14: వేములవాడ రాజరాజేశ్వరస్వామివారి దేవస్థానంలో శనివారం లక్ష్మీగణపతిస్వామి మహాపూజ ఘనంగా నిర్వహించారు. గణేశ్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా నాగిరెడ్డి మండపంలో అర్చకులు ఉదయం మహాగణపతి మూలమంత్ర హవనము, ప్రధాన ఆలయంలో కొలువై ఉన్న మూల విరాట్టు లక్ష్మీ గణపతిస్వామివారికి రాత్రి మహాపూజ చేశారు. ఆలయ అధికారులు, భక్తులు ఈ సందర్భంగా స్వామి వారిని దర్శించుకున్నారు. రాజన్న ఆలయంలో ప్రతిష్ఠించిన విఘ్నేశ్వరుడి వద్ద 15వ తేదీ ఆదివారం ఉదయం పూర్ణాహుతి నిర్వహించి రాత్రి ధర్మగుండంలో నిమజ్జన కార్యక్రమం నిర్వహిస్తామని ఆలయ అధికారులు తెలిపారు.

## అధికారుల పేరుతో వచ్చే కాల్స్‌పై అప్రమత్తంగా ఉండాలి

సిరిసిల్ల క్రైం, సెప్టెంబరు 14: అధికారుల పేరుతో వచ్చే ఫోన్ కాల్స్‌పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ అఖిల్ మహాజన్ ఒక ప్రకటనలో తెలిపారు. సైబర్ నేరాలకు గురైతే వెంటనే టోల్ ఫ్రీ నంబరు 1930కి కాల్ చేసి ఫిర్యాదు చేయాలని పేర్కొన్నారు. సాంకేతిక పరిజ్ఞానంతో సైబర్ మోసగాళ్లు వివిధ రూపాల్లో ప్రజలను బురిడీ కొట్టిస్తున్నారని, మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు. ఇతర శాఖల అధికారులమంటూ సైబర్ నేరగాళ్ల ఏదో ఒక నంబరు నుంచి ఫోన్ చేయడం, మీరు లేక మీ కుటుంబసభ్యులు ఏదో కేసులో ఇరుక్కున్నారని బెదిరించడం, డబ్బులు డిమాండ్ చేయడం వంటి కేసులు పెరిగిపోయాయని తెలిపారు. ఇలాంటి ఫోన్ కాల్స్‌కు గుర్తు తెలియని వ్యక్తులు చెప్పే మాటలు, ఫోన్లు మెస్సేజ్‌లు, లింక్‌లకు స్పందించవద్దని పేర్కొన్నారు. మోసాలకు గురైతే వెంటనే సైబర్ క్రైం హెల్ప్‌లైన్ నంబరు 1930లో ఫిర్యాదు చేయాలని సూచించారు.

## చిన్నారి బ్లెస్సీకి రాష్ట్ర స్థాయి సేవా పురస్కారం



కోనరావుపేట, సెప్టెంబరు 14: ప్రకృతి ప్రేమికురాలు చిన్నారి బ్లెస్సీ 'పుడమికి పచ్చని హారం' రాష్ట్రస్థాయి సేవా పురస్కారాన్ని అందుకుంది. కోనరావుపేట మండలం సుద్దాల కు చెందిన ప్రకృతి ప్రేమికుడు దొబ్బల ప్రకాష్ కూతురు చిన్నారి బ్లెస్సీ అదే గ్రామంలోని పాఠశాలలో ఐదోతరగతి చదువుతోంది. ప్రకృతి ప్రేమికులుగా పేరొందుతూ మొక్కలను నాటుతూ వాటిని సంరక్షిస్తోంది. ఈ సందర్భంగా బ్లెస్సీకి ఏకే తెలుగు మీడియా ముంబై ఆధ్వర్యంలో పుడమికి పచ్చని హారం పురస్కారాన్ని శనివారం మీడియా వ్యవస్థాపకుడు కంటే అశోక్ ఆన్‌లైన్ ద్వారా అందజేశారు. ఈ సందర్భంగా బ్లెస్సీ తండ్రి ప్రకాష్ ఆ సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు.

## తాత్కాలిక రోడ్డు పనుల పరిశీలన



పరిశీలిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ

గంభీరావుపేట: గంభీరావుపేట-లింగన్నపేట మానేరు వాగు తాత్కాలిక మట్టి రోడ్డు పనులను కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ, సిరిసిల్ల నియోజక వర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి శనివారం పరిశీలించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నర్మాల ఎగువ మానేరు జలాశయం పొంగి పొర్లడంతో వరద ఉధృతికి వాగుపై ఉన్న తాత్కాలిక మట్టిరోడ్డు కొట్టుకుపోయింది. ఈ మార్గం వెంట వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. సిరిసిల్ల నియోజక వర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డికి పార్టీ మండల అధ్యక్షుడు హమీద్‌పరిస్థితిని వివరించారు. దీంతో ప్రజల ఇబ్బందులను కేకే మహేందర్‌రెడ్డి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా పరిశీలించిన కలెక్టర్ కొత్త బ్రిడ్జి పనులను చేపట్టాలని, తాత్కాలిక రోడ్డును వెంటనే వేయాలని సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. అనంతరం నమాజ్ చెరువులోకి వచ్చే ముస్తాఫనగర్ బోదర్‌కాలువను పరిశీలించారు. రైతుల ఇబ్బందులను త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. వారి వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హమీద్, జిల్లా పాధ్యక్షుడు కొమిరిశెట్టి తిరుపతి, రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి పర్శ హన్మండ్లు, ప్రధాన కార్యదర్శి రామచంద్రరెడ్డి, సోషల్ మీడియా కన్వీనర్ గౌరి శంకర్, యూత్ నాయకులు గంగి స్వామి, నాయకులు తదితరులు ఉన్నారు.

# ఈతరం రచయితలకు గూడూరి కథలు స్ఫూర్తిదాయకం





అవార్డు అందుకుంటున్న అచార్య సూర్యధనుంజయ్, పిన్నంశెట్టి కిషన్

సిరిసిల్ల, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): తొలితరం కథకుడిగా, సాహిత్యంలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని పదిల పర్చుకున్న గూడూరి సీతారాం కథలు ఇప్పటి కథా రచయితలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని అఖిల భారత తెలంగాణ రచయితల వేదిక అధ్యక్షుడు, దాశరథి పురస్కార గ్రహీత జూకంటి జగన్నాథం అన్నారు. శనివారం సాయంత్రం సిరిసిల్ల జిల్లా కేంద్రంలో సినారె జిల్లా గ్రంథాలయంలో మానేరు రచయితల సంఘం, గూడూరి సీతారాం ఫౌండేషన్ ఆధ్వర్యంలో పురస్కార ప్రదానోత్సవం నిర్వహించారు. ఏటా జాతీయ స్థాయిలో అందిస్తున్న గూడూరి సీతారాం కథా పురస్కారాన్ని 2023 సంవత్సరానికి ఝాళిగోర్ బంజారా సాకి కథ రచయిత అచార్య సూర్యధనుంజయ్, మా లెంబాళవాటిక కథల రచయిత పిన్నంశెట్టి కిషన్‌కి అవార్డులను ప్రదానం చేశారు. ఇటీవల మృతిచెందిన సినీ దర్శకుడు, కవి వడ్డెపల్లి కృష్ణకు నివాళులు తెలిపారు. ఇదే సందర్భంలో దాశరథి పురస్కారాన్ని అందుకున్న రచయిత, కవి జూకంటి జగన్నాథం, కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కారానికి ఎంపికైన రమేష్ కార్తీక్, రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్న పాకాల శంకర్‌గౌడ్, అధ్యాపకురాలిగా అవార్డు అందుకున్న సూర్యధనుంజయ్‌ని సన్మానించారు. అనంతరం జగన్నాథం మాట్లాడుతూ గూడూరి సీతారాం జీవన ప్రస్థానాన్ని వివరిస్తూ రాసిన అనేక కథలు అందుబాటులో లేకుండా పోయాయన్నారు. దొరికిన కథలను సంకలనంగా తెచ్చినట్లు చెప్పారు. 84 కథలకు పైగా రాస్తే 14 కథలు మాత్రమే అందుబాటులో ఉన్నాయన్నారు. గతంలో ముగ్గురికి అవార్డులు అందించినట్లు చెప్పారు. అవార్డులు అందుకున్న వారికి అభినందనలు తెలిపారు. సీతారాం కథలు అనాటి పరిస్థితులకు అద్దం పడుతాయని, ఇప్పటి తరానికి అధ్యయనానికి దోహదపడుతాయని అన్నారు. అవార్డు గ్రహీత ప్రొఫెసర్ సూర్యధనుంజయ్, రచయిత పిన్నంశెట్టి కిషన్ మాట్లాడుతూ కథలు జీవితంలోంచి వచ్చినవే కాలగమనంలో నిలిచిపోతాయని అనుభవంలోంచి వచ్చిన కథలు సమాజానికి ఉపయోగపడుతాయని అన్నారు. పురస్కార ప్రదానోత్సవ సభకు మానేరు రచయితల సంఘం అధ్యక్షుడు టీవీ నారాయణ అధ్యక్షత వహించారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ పత్తిపాక మోహన్, పురస్కార ప్రదాత గూడూరి వేణు, తెలంగాణ టెక్స్‌టైల్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, కవులు, రచయితలు, అడెపు లక్ష్మీపతి, పిన్నంశెట్టి రవీంద్ర, మారసం కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎలగొండ రవి, ప్రధాన కార్యదర్శి అడెపు లక్ష్మణ్, డాక్టర్ జనపాల శంకరయ్య, కొక్కుల భాస్కర్, శ్రీమతి, బూర దేవానందం, వంశీ, కిరణ్, నారాయణగౌడ్, భాగ్యలక్ష్మీ, శ్రీనివాస్ పాల్గొన్నారు.



## నిరుపేదలకు అండగా ప్రభుత్వం



సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

ఇల్లంతకుంట, సెప్టెంబరు 14: నిరుపేదలకు రాష్ట్రప్రభుత్వం అండగా నిలుస్తోందని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం వివిధ గ్రామాలకు చెందిన వారికి సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేదల ఆరోగ్యాన్ని కాపాడడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. ఇందులో భాగంగానే ఆరోగ్యశ్రీ పరిధి మొత్తాన్ని పెంచిందన్నారు. ఆరోగ్యశ్రీ పరిధిలోకి రానివారి కోసం సీఎం సహాయనిధి ద్వారా ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు చెప్పారు. నియోజకవర్గ కేంద్రంలో సీఎం సహాయనిధి దరఖాస్తులు తీసుకోవడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశామని, దళారులను ఆశ్రయించవద్దని అన్నారు. మెరుగైన వైద్యం కోసం ఆస్పత్రుల్లో ఖాళీలను భర్తీచేస్తున్నట్లు తెలిపారు. మండల అభివృద్ధే లక్ష్యంగా పాలన కొనసాగుతోందన్నారు. తొలుత ప్యాక్స్‌డైరెక్టర్ చెరుకు శ్రీనివాస్‌రెడ్డి కుటుంబానికి శ్రీరామ ఇన్సూరెన్స్ కింద చెక్కును అందించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ ఐరెడ్డి చైతన్యమహేందర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాఘవరెడ్డి, మాజీ ఎంపీపీలు రమణారెడ్డి, అయిలయ్య, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు వినయ్‌కుమార్, అధికార ప్రతినిధి పసుల వెంకటి, ఏఎంసీ వైస్ చైర్మన్ ప్రసాద్, నాయకులు ఉప్పల అమర్, మామిడి రాజు, నాగలక్ష్మీ, బెజ్జంకి శ్రీనివాస్, మంద బాల్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.



# గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి సలహా కమిటీ ఏర్పాటు

**- రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**



సమావేశంలో మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్

వేములవాడ, సెప్టెంబర్ 14 : గల్ఫ్ కార్మికుల సమస్యల అధ్యయనం, సంక్షేమం కోసం తీసుకోవాల్సిన చర్యలపై ప్రభుత్వం తరఫున ఒక సలహా కమిటీని నియమించాలని నిర్ణయించినట్లు వేములవాడ శాసనసభ్యుడు, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు. రాష్ట్రంలో గల్ఫ్ బోర్డు ఏర్పాటు, ఎన్నారై పాలసీ అమలుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన శనివారం హైదరాబాద్‌లో పలువురు శాసనసభ్యులు, గల్ఫ్ కార్మిక సంఘాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించినట్లు ఆది శ్రీనివాస్ తెలిపారు. టీపీసీసీ ఎన్ఆర్ఐ సెల్ ప్రతినిధి వినోద్ ఆధ్వర్యంలో గల్ఫ్ బాధితులకు సంబంధించి రూపొందించిన 5 అంశాలపై సమావేశంలో చర్చించామని, ప్రధానంగా గల్ఫ్ కార్మికుల సంక్షేమంపై అధ్యయనం చేయడానికి ప్రభుత్వం ఒక సలహా కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించిందని వెల్లడించారు. గల్ఫ్ ప్రభావిత ప్రాంత ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నాయకులను ఈ కమిటీలో సభ్యులుగా నియమించి ఇందుకోసం జీవో విడుదల చేయాలని సూచించినట్లు వివరించారు. హైదరాబాద్ ప్రజాభవన్‌లో ప్రతీ మంగళవారం, శుక్రవారం ప్రజావాణిలో గల్ఫ్ కార్మికుల కోసం ప్రవాసి ప్రజావాణి నిర్వహిస్తే బాగుంటుందని సూచించారని, గురుకుల పాఠశాలు, కళాశాలల్లో గల్ఫ్ కార్మికుల పిల్లలకు 5 శాతం సీట్లు కేటాయించాలని, ఇందులో గల్ఫ్ బాధిత కుటుంబాలకు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 7 డిసెంబర్ 2023 నుంచి ఏ కారణం చేతనైనా గల్ఫ్ దేశాల్లో మరణించిన కార్మికుల కుటుంబాలకు 5 లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, గతంలో చనిపోయిన వారి కుటుంబాలకు మానవతా దృక్పథంతో లక్ష రూపాయల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని సూచించినట్లు వెల్లడించారు.

వేములవాడ నియోజకవర్గానికి చెందిన గల్ఫ్‌లో మృతి చెందిన రెండు కుటుంబాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో సీఎంఆర్ఎఫ్ నుంచి ఇప్పటికే 5 లక్షల రూపాయల చొప్పున ఎక్స్‌గ్రేషియా అందజేశామని ఆది శ్రీనివాస్ వివరించారు. గల్ఫ్ కార్మికుల కోసం చర్చించిన అంశాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని, త్వరలో సలహా కమిటీ నియమించాలని కోరుతామని తెలిపారు. ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, డాక్టరు సంజయ్ కుమార్, కెఆర్.నాగరాజు, డాక్టరు ఆర్.భూపతి రెడ్డి, జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, కార్పోరేషన్ చైర్మన్లు అనిల్, ఈరవత్రి, సుంకేట అన్వేష్ రెడ్డి, నాయకులు వెలిచాల రాజేందర్ రావు, పి.వినయ్ రెడ్డి, కూచాడి శ్రీహరి రావు, వలస నిపుణులు అంబాసిడర్ డా. బీఎం వినోద్ కుమార్, గల్ఫ్ వలస కార్మిక నాయకులు మంద భీంరెడ్డి, సింగిరెడ్డి నరేష్ రెడ్డి, చెన్నమనేని శ్రీనివాస రావు, స్వదేశ్ పరికిపండ్ల, లిజీ జోసెఫ్, ఫలియా, పత్తిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి, ఎన్నారై విభాగం అధికారి ఇ.చిట్టిబాబు తదితరులు సలహాలు సూచనలు అందజేశారని ఆది శ్రీనివాస్ తెలిపారు.

# పోలీసు విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసు

చొప్పదండి, సెప్టెంబరు 14: పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ అనూష తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. హెడ్ కానిస్టేబుల్ రవికుమార్, హోంగార్డు ఎల్లయ్య శుక్రవారం అర్ధరాత్రి పెట్రోలింగ్ చేస్తుండగా డయల్ 100కి ఒక వ్యక్తి ఫోన్ చేసి ముగ్గురు అనుమానిత వ్యక్తులు తిరుగుతున్నారని ఫిర్యాదు చేశాడు. ఇద్దరు పోలీసులు గుమ్లాపూర్ వాహనంలో వెళ్తున్నారు. ఆ సమయంలో ఇద్దరు వ్యక్తులు పోలీసులకు ఎదురు కాగా గ్రామస్థులు తమను దొంగలు అనుకొని వెంటపడితే బైక్ వదిలిపెట్టి నడుచు కుంటూ వస్తున్నామని తెలిపారు. వారిద్దరిని వాహనంలో తీసుకొని గుమ్లాపూర్‌కి వెళ్లారు. అక్కడ మోటార్ సైకిల్ ఉండగా అదే సమయానికి అక్కడ కొందరు వ్యక్తులు పోలీసు లతో గొ డవకు దిగారు. అక్కడ ఉన్న కోలాపురి విజయ్ అనే వ్యక్తి పోలీసులతో దురుసుగా మా ట్లాడుతూ జీపులో ఉన్న వారిని మాకు అప్పగించాలని పోలీసులను నెట్టివేశాడు. గొడవ చేసి పోలీసుల విధులకు ఆటంకం కలిగించాడని హెడ్‌కానిస్టేబుల్ రవికుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కోలపురి విజయ్ మీద కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చెప్పారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

## తేలుకాటుకు పారిశుధ్య కార్మికుడి దుర్మరణం


నల్లూరి కళ్యాణ్(ఫైల్)

ఓదెల/యైటింక్లయిన్‌కాలనీ, సెప్టెంబరు 14: నిత్యం చెత్తకుప్పల మధ్య పని చేసే పారిశుధ్య కార్మికులకు గాయాలు కావడం మామూలే. అలా పని చేస్తున్న క్రమంలో తేలు కాటుకు గురై సాధారణ గాయంగా భావించి నిర్లక్ష్యం చేశాడా కార్మికుడు. విషం శరీరమంతా వ్యాపించిన తరవాత ఆస్పత్రికి వెళ్లినా ప్రయోజనం లేక పోయింది. నాలుగు రోజులు మృత్యువుతో పోరాడి చివరకు ప్రాణాలు కోల్పోయాడు. వివారాలు ఇలా ఉన్నాయి. పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం పోత్కపల్లికి చెందిన నల్లూరి కళ్యాణ్ (26) రామగుండం మున్సిపాలిటీలో పారిశుధ్య కార్మికునిగా పని చేస్తున్నాడు. 8ఇంక్లైన్ దగ్గరలో ఉన్న వెంకట్రావు పల్లి లో బుధవారం చెత్తను తొలగిస్తున్న క్రమంలో చేతికి గాయమైంది. చెత్తలో ఉన్న ఏదో వస్తువు తగిలిందని భావించి తన పని తాను చేసుకుంటూ పోయాడు. కొది సేపటికి అతని ఆరోగ్యం విషమించడంతో చెత్తలో ఉన్న తేలు కాటు వేసినట్లు తోటి కార్మికులు గుర్తించారు. గోదావరిఖని ఆసుపత్రికి చికిత్స కోసం తరలించగా విష ప్రభావం గుండె, మెదడు వంటి శరీర అవయవాలపై చూపుతోందని గుర్తించి మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి డాక్టర్ల సూచన మేరకు హైదరాబాద్ లోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ రెండు రోజులుగా వైద్య చికిత్సలు చేసినా పరిస్థితి అదుపులోకి రాలేదు. చివరకు శనివారం కల్యాణ్ మృతి చెందాడు. తేలు కాటును వెంటనే గుర్తించి సకాలంలో వైద్యం అంది ఉంటే పరిస్థితి ఇలా ఉండేది కాదని తోటి కార్మికులు వాపోతున్నారు. మృతునికి భార్య, కుమారుడున్నారు.

## 19 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

శంకరపట్నం, సెప్టెంబరు 14: మండలంలోని మొలంగూర్ ఎక్స్ రోడ్ వద్ద శనివారం అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్నామని ఎస్‌ఐ కొత్తపల్లి రవి తెలిపారు. తెల్లవారుజామున సిబ్బందితో కలిసి పెట్రోలింగ్ చేస్తూ వాహనాలు తనిఖీ చేయగా తాడికల్ గ్రామానికి చెందిన నరాల అంకూస్ ట్రాలీ ఆటోలో అక్రమంగా తరలిస్తున్న 19క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు చెప్పారు. అంకూస్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రవి తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

హుజూరాబాద్‌రూరల్, సెప్టెంబరు 14: మండలంలోని తుమ్మనపల్లి గ్రామానికి చెందిన గోడిశాల సదానందం అనే ఆర్‌ఎంపీ డాక్టర్ శుక్రవారం రాత్రి జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. జమ్మికుంట నుంచి హుజూరాబాద్ వైపు ద్విచక్ర వాహనంపై వస్తుండగా చెల్పూర్ సమీపంలో ఎదురుగా వస్తున్న మరోక ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. ఈ సంఘటనలో సదానందంకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు హుజూరాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

## ఇసుక ట్రాక్టర్‌ల పట్టివేత

వీణవంక, సెప్టెంబరు 14: మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామంలో పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా అనుమతి పత్రాలు లేకుండా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని పోలీస్ స్టేషన్ తరలించారు. పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన జీల పర్శరాములు ట్రాక్టర్‌లో మానేరు నుంచి జమ్మికుంటకు తరలిస్తుండగా కేసు నమోదు చేశారు.

**గన్నేరువరం:** మండలంలోని గుండ్లపల్లి స్టేజి వద్ద బెజ్జంకి మండలం దేవక్కపల్లి నుంచి అను మతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను శనివారం పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించిన ట్లు ఎస్‌ఐ తాండ్ర నరేష్ తెలిపారు.

## మద్యం విక్రయిస్తున్న ముగ్గురిపై కేసు నమోదు

వీణవంక, సెప్టెంబరు 14: మండలంలోపెట్రోలింగ్ చేస్తుండగా శనివారం అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తుపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తిరుపతి తెలిపారు. ముగ్గురు వద్ద నుంచి 41,000 రూపాయల విలువ గల మద్యం స్వాధీనం చేసుకొని కేసు నమెదు చేసినట్లు పేర్కొన్నారు. కొర్కల్ లో బెల్ట్ షాప్ నిర్వహిస్తున్నా అంబరగొండ శ్రీనివాస్ నుంచి 7,530 రూపాయల విలువ గల మద్యం, చల్లూరులో గర్వందుల శివకృష్ణ నుంచి 32,260 రూపాయల విలువ ఉన్న, కొత్తపల్లిలో బొడిపల్లి కోటేశ్వర్ నుంచి 11,150 విలువ గల మద్యం స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

సినిమా వార్తల కోసం www.andhrajyothy.comను క్లిక్ చేయండి

# గల్ఫ్ బోర్డు, ఎన్ఆర్ఐ పాలసీపై ముందడుగు

**- హైదరాబాద్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించిన మంత్రి పొన్నం- హాజరైన జగిత్యాల ఎమ్మెల్యే, గల్ఫ్ ప్రభావిత ప్రాంతాల నేతలు**


సమావేశం నిర్వహిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

జగిత్యాల, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): గల్ఫ్ బోర్డు ఏర్పాటు, ఎన్ఆర్ఐ పాలసీపై ప్రభుత్వం ముందడుగు వేసి పలు కసరత్తులు నిర్వహిస్తోంది. శనివారం హైద్రాబాద్‌లోని సచివాలయంలో రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కన్వీనర్‌గా గల్ఫ్ కార్మికుల సంక్షేమం కొరకు తీసుకోవాల్సిన చర్యల గురించి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచన మేరకు అందుబాటులో ఉన్న గల్ఫ్ ప్రభావిత ప్రాంత ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వివిధ కార్పోరేషన్ల ఛైర్మన్లు, నాయకులు, గల్ఫ్ వలసల నిపుణులు, అధికారులతో పలు అంశాలపై చర్చించారు. 2023 అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ అభయ హస్తం ఎన్నికల మేనిఫెస్టోలో 'గల్ఫ్ కార్మికులు, ఎన్ఆర్ఐల సంక్షేమం' పేరుతో ఇచ్చిన నాలుగు హామీల అమలుకు అవసరమైన పలు కసరత్తులను సమావేశంలో నిర్వహించి పలు నిర్ణయాలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్‌తో పాటు చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, వర్ధన్నపేట, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యేలు నాగరాజు, భూపతిరెడ్డి, జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, వివిధ కార్పోరేషన్ల ఛైర్మన్లు ఈరవత్రి అనిల్, సుంకెట అన్వేష్ రెడ్డి, వినయ్ రెడ్డి, శ్రీహరి రావు, వెలిచాల రాజేందర్, వలస నిపుణులు అంబాసిడర్ వినోద్ కుమార్, గల్ఫ్ వలస కార్మిక నాయకులు మంద బీంరెడ్డి, సింగిరెడ్డి నరేశ్ రెడ్డి, స్వదేశ్ పరికిపండ్ల, రాజేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కరీంనగర్ కథల్లో
# మనిషి జీవించే హక్కులు

**- కేంద్ర సాహిత్య అకాడమీ తెలుగు సలహా మండలి కన్వీనర్ మృణాళిని - 'కరీంనగర్ కథలు' సంకలనం ఆవిష్కరణ**

సిరిసిల్ల రూరల్, సెప్టెంబరు 14 : సాహిత్యానికి పుట్టినిల్లుగా ఉన్న కరీంనగర్ ప్రాంతంలోని కవులు, రచయితుల రాసిన కథల్లో మనిషి జీవించే హక్కులు కనిపిస్తున్నాయని కేంద్ర సాహిత్య అకాడమీ తెలుగు సలహా మండలి కన్వీనర్ అచార్య సి.మృణాళిని అన్నారు. శనివారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని రంగినేని సుజాత మోహన్‌రావు ఎడ్యుకేషన్ చారిటబుల్ ట్రస్ట్‌లో కరీంనగర్ కథల సంకలనం పరిచయసభ నిర్వహించారు. కేంద్ర సాహిత్య అకాడమీ తెలుగు సలహా మండలి కన్వీనర్ మృణాళిని, ప్రసిద్ధ కథా రచయిత అల్లం రాజయ్య, ప్రొఫెసర్ కాశీం, కథా సంకలనం సంపాదక వర్గం రచయితలు జూకంటి జగన్నాథం, డాక్టర్ నలిమెల భాస్కర్, పెద్దింటి అశోక్‌కుమార్, డాక్టర్ పత్తిపాక మోహన్, గరిపెల్లి అశోక్‌కుమార్, కరీంనగర్ కథల సంపుటిని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అచార్య మృణాళిని మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతంలో క్రీస్తుకు పూర్వం నుంచి ప్రజల భాషలో అనేక కథలు వచ్చాయన్నారు. ప్రజల భాషలో సాహిత్యం తెలంగాణ ప్రాంతం నుంచి వచ్చిందన్నారు. అనేక చారిత్రక పరిణామాలకు మనిషి జీవించే హక్కు కోసం తపించిన కథలు కరీంనగర్ కథల్లో కనిపిస్తు న్నాయన్నారు. కరీంనగర్ కథల్లో ప్రచురిం చిన ప్రతీ కథలు ప్రజల హక్కులను చూపిస్తున్నాయన్నారు. ఆ కథల్లో కవులు, రచయితలు రచించిన మా


సిరిసిల్లలో కరీంగనర్ కథల సంకలనాన్ని ఆవిష్కరిస్తున్న రచయితలు

దిరిగానే ప్రజలు తమ హక్కులను తెలుసుకోవాలని సూచించారు. ప్రముఖ రచయిత అల్లం రాజయ్య మాట్లాడుతూ శతాబ్దం యుద్ధ విషాదాలనుంచి ఇక్కడ సమాజం సంఘర్షణ పడుతూనే ఉందన్నారు. 90 సంవత్సరాల కథలను సంకలనంగా కరీంనగర్ కథలను తీసుకరావడం హర్షనీయమన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ తెలుగు ప్రొఫెసర్ కాశీం మాట్లాడుతూ కాళోజీ సంకలనంలో కథలు, సాహిత్యంలో వ్యాపార సంస్కృతి ప్రబలిపోతున్న కాలంలో నిశ్శబ్దంగా నిలబడ్డాయన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ ఛైర్మన్ రంగినేని మోహన్‌రావు, రంగినేని నవీన్‌కుమార్, కవులు, రచయితలు బెజ్జారపు రవీందర్, బెజ్జారపు వినోద్‌కుమార్, అమర్, ఆడెపు లక్ష్మీపతి, రాజిరెడ్డి, దేవేందర్, బూర్ల వెంకటేశ్వర్లు, ఎల గోండ రవి, ఆడెపు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రాణం మీదికి తెచ్చిన రీల్స్ సరదా

**- గూడ్స్ రైలెక్కి యువకుడి ఫొటోలు**

**- విద్యుదాఘాతంతో తీవ్ర గాయాలు**

కాజీపేట, సెప్టెంబరు 14: రీల్స్ సరదా పిచ్చి ముదురుతోంది. ఈ సరదాలో పడి ప్రాణం మీదికి తెచ్చుకుంటున్నారు. కాజీపేటలో ఓ యువకుడు గూడ్స్ రైలు బోగి ఎక్కి రీల్స్ చేస్తుండగా విద్యుదాఘాతానికి గురయ్యాడు. స్థానికులు, 108 సిబ్బంది తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌కు చెందిన రాజు అనే యువకుడు శనివారం కడిపికొండలో ఓ చర్చిలో జరుగుతున్న కార్యక్రమానికి హాజరయ్యాడు. కార్యక్రమం జరుగుతుండగా సమీపంలోని రాంనగర్‌లో నిలిపి ఉన్న రైలు బోగీ ఎక్కి సెల్‌ఫోన్‌లో రీల్స్ చేస్తున్నాడు. ఈ క్రమంలో రైలుపై ఉన్న హైటెన్షన్ కరెంట్ తీగలు రాజును లాగిపడేశాయి. దీంతో కరెంట్ షాక్‌కు గురైన రాజు తీవ్రగాయాలతో బోగీ నుంచి కిందపడిపోయాడు. గమనించిన స్థానికులు.. 108కు సమాచారం ఇచ్చారు. దీంతో హుటాహుటిన 108 మెడికల్ టెక్నీషియన్ లింగాల శివకుమార్, పైలట్ కుంట రవిలు ఘటనాస్థలికి చేరుకుని ఎమర్జెన్సీ చికిత్స చేసి ఎంజీఎంకు తరలించారు. ఈ ఘటనలో రాజు 70 శాతం శరీరం కాలిపోయిందని ఎంజీఎం వైద్యులు తెలిపారు. స్పృహ కోల్పోయిన రాజు కుటుంబ వివరాలు తెలియాల్సి వుంది.

## ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలి

గొల్లపల్లి, సెప్టెంబరు 14: దీర్ఘకాలంగా రాష్ట్రంలోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయాల్లో పని చేస్తున్న సెక్యూరిటీ గార్డుల ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని కోరుతూ ధర్మారం మండల కేంద్రంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు సెక్యూరిటీ గార్డులు శనివారం వినతిపత్రం సమర్పించారు. తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ మార్కెట్ కమిటీలలో 1994 సంవత్సరం నుంచి ఇప్పటివరు సెక్యూరిటీ గార్డులుగా 1200 మంది నియమితులై దాదాపు 27 సంవత్సరాలుగా మార్కెట్ కమిటీకి సేవలు చేస్తున్నామని, ఏజెన్సీ విధానం రద్దు చేస్తూ తమను రెగ్యులరైజ్ చేయాలని కోరారు. మార్కెట్ కమిటీ నిధుల నుంచి జీతభత్యాలు చెల్లిస్తున్నందున సర్వీస్ రెగ్యులర్ చేయడం వలన ప్రభుత్వ ఖజానాపై ఎలాంటి భారం పడదని, అనుబంధంగా ఉన్న ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులందరి సర్వీస్‌ను రెగ్యులర్ చేశారని, వారిలాగే తమ సర్వీస్‌ను కూడా రెగ్యులర్ చేసి మా బతుకుల్లో వెలుగులు నింపి కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో అబ్దుల్ సలీం, బొల్లం మల్లేశం, ముంజ సతీష్ గౌడ్, కిషన్ రావు, జూపాక కుమార స్వామి, జనార్దన్, హైమద్ చందు పాల్గొన్నారు.

# నృసింహుడి సన్నిధిలో భక్తుల రద్దీ


నృసింహుడిని దర్శనం చేసుకుంటున్న భక్తులు

ధర్మపురి, సెప్టెంబరు 14: ధర్మపురి క్షేత్రంలో భాద్రపద మాసం ఏకాదశి శనివారం భక్తుల రద్దీ నెలకొంది. దీంతో లక్ష్మీ నరసింహస్వామి అనుబంధ ఆలయాలు భక్తులతో కిట కిట లాడాయి. ఉదయం ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, సామవేద పండితులు ముత్యాలశర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్చరణల మధ్య ఆలయ ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, అర్చకులు స్వామి వారలకు పంచోపనిషత్తులతో అభిషేకం, సప్త హారతులు, నివేదన, నీరాజన, మంత్రపుష్పాలు, తీర్థ, ప్రసాద వితరణ జరిపారు. గోదావరి నదిలో స్నానాలు చేసిన భక్తులు వివిధ రకాల పూజా టిక్కెట్లు కొనుగోలు చేశారు. అభిషేకం, కుంకుమార్చన, స్వామి వారల నిత్య కళ్యాణం, నరసింహ హోమం జరిపించారు. ఆలయం పక్షాన ఈవో సంకటాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిబ్బంది భక్తులకు తగు సేవలు అందించారు. ఆలయ ఈవో సంకటాల శ్రీని వాస్, ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, వేదపారాయణదారు పాలెపు ప్రవీణ్‌శర్మ పాల్గొన్నారు.

● లక్ష్మీనరసింహ స్వామి దేవాలయాన్ని మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ మోతీలాల్ కుటుంబ సమేతంగా సందర్శించారు. వేద పండితులు, అర్చకులు, సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం ఆయన స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య అర్చకులు ఆయనను ఘనంగా ఆశీర్వదించారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ వారికి స్వామి శేష వస్త్రం, ప్రసాదాలు బహూకరించి సత్కరించారు.

## తుమ్మేటి సమ్మిరెడ్డి ఆకస్మిక మృతి

**- అంత్యక్రియల్లో పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్**

జమ్మికుంట, సెప్టెంబరు 14: జమ్మికుంటకు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మేటి సమ్మిరెడ్డి (59) గుండెపోటుతో శుక్రవారం అర్ధరాత్రి ఆకస్మాత్తుగా మృతి చెందారు. గుండెపోటుకు గురైన సమ్మిరెడ్డిని కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందారు. కాంగ్రెస్ పార్టీలో విద్యార్థి నాయకుడి నుంచి ఎదిగి రెండు పర్యాయాలు జమ్మికుంట మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పని చేశారు. కాగా తుమ్మేటి సమ్మిరెడ్డి మరణ వార్త విన్న మంత్రి పొన్నం ప్రభాకర్ తన కార్యక్రమాలను వాయిదా వేసుకోని హైదరాబాద్ నుంచి హుటాహుటిన జమ్మికుంటకు వచ్చారు. సమ్మిరెడ్డి భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సమ్మిరెడ్డి కుమారుడిని పరామర్శించారు. అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఆయన వెంట మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఉన్నారు. మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ఫోన్‌లో సమ్మిరెడ్డి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు, హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్‌బాబు, యుప్‌టీవీ సీఈవో పాడి ఉదయ్‌నందన్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి,


నివాళులు అర్పిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్
తుమ్మేటి సమ్మిరెడ్డి (ఫైల్) (ఇన్‌సెట్‌లో)

జిల్లా ఉపాధ్యక్షుడు ఎరబెల్లి సంపత్‌రావు, సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి, మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు, వైస్ చైర్‌పర్సన్ దేశిని స్వప్న-కోటి, ప్రజా ప్రతినిధులు, ప్రముఖ రాజకీయ నాయకులు, కార్యకర్తలు బాధిత కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

## సీపీడబ్ల్యూఎస్ పథకాన్ని పునరుద్ధరించండి

గిత్యాల అర్బన్, సెప్టెంబరు 14: జగిత్యాల నియోజకవర్గంలోని బీర్‌పూర్ మండలంలో ఉమ్మడి రాష్ట్రంలో నెలకొల్పబడిన సీపీడబ్ల్యూఎస్ పథకాన్ని పునరుద్ధరించాలని కోరుతూ సీఎం రేవంత్ రెడ్డికి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2004-2009 సంవత్సరానికి సంబంధించి మండలంలో ప్యూరిఫైడ్ వాటర్ సరఫరా నిమిత్తం ఈ స్కీం ఏర్పాటు చేయబడిందన్నారు. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత అధికారంలోకి వచ్చిన టీఆర్ఎస్ తాగునీటి సరఫరాకు సంబంధించి మిషన్ భగీరథ పథకాన్ని తెరపైకి తెచ్చిందన్నారు. ఈ పథకం ద్వారా శుద్ధనీటిని సరఫరా చేస్తామని ప్రకటించి సీపీడబ్ల్యూఎస్ పథకాన్ని పక్కనపెట్టారన్నారు. అటు భగీరథ నీరుఅందక, ఇటు సీపీడబ్ల్యూఎస్ పథకం నిర్లక్ష్యానికి గురికావడంతో మండల ప్రజలు తాగునీటికోసం వాటర్ ప్లాంట్‌ల వద్ద కొనుగోలు చేసుకుని తాగే పరిస్థితి ఏర్పడిందన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాయికల్, జగిత్యాల మండలాల్లో రాపిడ్ స్టాండ్ ఫిల్టర్ నీటి శుద్ధి కేంద్రాల మాదిరిగానే ఇప్పుడున్న 2ఎంఎల్‌డీ ఎస్ఎస్ఎఫ్ స్థానంలో 5ఎంఎల్‌డీ ఆర్ఎస్ఎఫ్ నీటి శుద్ధి కేంద్రం నిర్మించి, బీర్‌పూర్ మండలంలోని 34 గ్రామాలకు తాగునీరు అందించే అవకాశం ఉందన్నారు. కావున బీర్‌పూర్ మండలంలోని సీపీడబ్ల్యూఎస్ పథకాల పునరుద్ధరణకు సంబంధించి రూ.800లక్షలతో అంచనాలు రూపొందించామని, గ్రామీణ ప్రాంత ప్రజల తాగునీటి అవసరాలు తీర్చే అవకాశం ఉన్న నేపథ్యంలో రివైజ్డ్ అంచనాలకు అనుగుణంగా సంబంధిత అంచనా నిధులు మంజూరు చేయాలని కోరారు.

## గురుకుల ఉపాధ్యాయుల పనివేళలు మార్చాలి

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు 14: గురుకుల ఉపాధ్యాయుల పని వేళలను మార్చాలని యూటీఎఫ్ ఎంజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లివిన్‌స్టన్ డిమాండ్ చేశారు. శనివారం జిల్లాలోని మహాత్మ జ్యోతిబాపూలే పాఠశాలలు, కళాశాలలను సందర్శించి యూటీఎఫ్ సభ్యత్వ నమోదు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురుకులాల ప్రిన్సిపాల్స్, జేఎల్స్, డిగ్రీ లెక్చరర్లకు గెజిటెడ్ హోదా కల్పించాలని, హెల్త్‌కార్డులు మంజూరీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆర్ట్, క్రాఫ్ట్, మ్యూజిక్, లైబ్రేరియన్స్, స్టాఫ్‌నర్స్ ప్రమోషన్ కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.కుమార్, జావేద్, సభ్యులు సురేశ్‌కుమార్, జాన్సన్, హరీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళా సెక్యూరిటీ గార్డ్‌పై లైంగిక వేధింపులు

**- షీ టీమ్‌కు సమాచారం ఇచ్చిన బాధితురాలు- రెండు నెలల్లో రెండో ఘటన**



రామగుండం మెడికల్ కళాశాల ముఖద్వారం

కళ్యాణ్‌నగర్, సెప్టెంబరు 14: సింగరేణి ఇన్స్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్(సిమ్స్)లో మహిళా సిబ్బందిపై లైంగిక వేధింపుల ఘటన మరొకటి వెలుగు చూసింది. సిమ్స్‌లో సెక్యూరిటీ గార్డ్‌గా పనిచేస్తున్న మహిళపై సెక్యూరిటీ సూపర్‌వైజర్ గాదె సుధాకర్ లైంగిక వేధింపులకు పాల్పడుతున్నట్టు ఆరోపణలు వచ్చాయి. అతని వేధింపులు భరించలేక బాధితురాలు షీ టీమ్‌కు ఫిర్యాదు చేసింది. దీంతో షీటీమ్ బాధితురాలి నుంచి వివరాలు సేకరించింది. ఘటనపై గోదావరిఖని వన్‌టౌన్ పోలీసులు విచారణ చేస్తున్నారు. బాధితురాలు మెడికల్ కళాశాలలో సెక్యూరిటీ గార్డ్‌గా పనిచేస్తోంది. సుధాకర్ సూపర్‌వైజర్‌గా పని చేస్తున్నాడు. నిత్యం నానా రకాలుగా బాధితురాలిని లైంగికంగా వేధిస్తుండడంతో ఆమె ప్రిన్సిపాల్ దృష్టికి కూడా తీసుకెళ్లింది. ప్రవర్తన మారకపోవడంతో షీటీమ్‌ను ఆశ్రయించింది. జూలైలో ఇదే కళాశాలలో ఒక సూపర్‌వైజర్ పారిశుధ్య విభాగంలో పని చేస్తున్న కార్మికురాలిని లైంగికంగా వేధించిన ఘటన చోటు చేసుకుంది. అతన్ని విధుల నుంచి తొలగించి చేతులు దులుపుకున్నారు. రెండు నెలల్లోనే సిమ్స్‌లో రెండో ఘటన వెలుగుచూడడం గమనార్హం. గోదావరిఖని సింగరేణి మెడికల్ కళాశాలో సెక్యూరిటీ అవుట్ సోర్సింగ్ ఏజెన్సీగా ఉన్న సంస్థ నిర్వహణ విషయంలో మాత్రం ప్రేక్షక పాత్ర పోషిస్తుందనే ఆరో పణలు ఉన్నాయి. పని స్థలాల్లో మహిళా కార్మికులకు రక్షణ, వేధింపులు లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత కూడా సంబంధిత ఏజెన్సీదే. ఒక ఘటన జరిగిన తరువాతనైనా దిద్దుబాటు చర్యలు చేపట్టాల్సి ఉంది. ఇవేమి చేపట్టకుండా నిర్వహణను గాలికి వదిలేశారనే విమర్శలు వస్తున్నాయి.

## పరస్పరదాడులు .. కేసు నమోదు

సిరిసిల్ల క్రైం, సెప్టెంబరు 14: పట్టణంలోని జిల్లా ఆసుపత్రి సమీపంలో వస్త్రదుకాణం ఎదుట వాహనం పార్కింగ్ ఘర్షణకు దారితీసింది. శుక్రవారం పట్టణంలో వస్త్ర దుకాణం ఎదుట కైలాస్ అనే వ్యక్తి కారు పార్క్ చేశాడు. దుకాణం ఎదుట కారు పార్క్ చేయడంతో తొలగించాలని వ్యాపారి శ్రీనివాస్ సూచించాడు. ఎందుకు తీయాలంటూ ప్రశ్నించడంతో పరస్ప రదాడులకు దారితీసింది. పోలీస్‌స్టేషన్‌లో ఇరువర్గాలు వారు ఫిర్యాదు చేశారు. కారు యజమాని కైలాస్‌పై, వస్త్రదుకాణం యజమాని శ్రీనివాస్, అతడి కుమారుడిపై శనివారం కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ కృష్ణ తెలిపారు.

## విష జ్వరంతో విద్యార్థిని మృతి


నక్షత్రహాసిని(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 14: రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని మైదంశెట్టి నక్షత్రహాసిని (14) అనే విద్యార్థిని విష జ్వరంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. నక్షత్రహాసిని స్థానిక ఓ ప్రైవేటు పాఠశాలలో ఏడో తరగతి చదువుతోంది. మూడు రోజుల కిందట జ్వరం బారిన పడడంతో విద్యార్థినికి మండల కేంద్రంలోని పీఎంపీ వైద్యుడి వద్ద చికిత్స చేయించారు. నయం కాకపోవడంతో హైదరాబాద్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం చనిపోయింది. నక్షత్రహాసిని తండ్రి ఉద్యోగ రీత్యా ఎల్లారెడ్డి పేటలో ఉంటున్నప్పటికీ వారి స్వగ్రామం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణం కావడంతో మృతదేహాన్ని అక్కడికి తరలించారు.

# కుక్కల స్వైర విహారం

**- దాడిలో ఐదుగురికి తీవ్ర గాయాలు**


**- గ్రామస్థుల భయాందోళన**


కరీంనగర్‌లో బాధితులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు
( ఇన్‌సెట్‌లో గాయపడ్డ చిన్నారి)

మంథని, సెప్టెంబరు 14: గ్రామాల్లో వీధి కుక్కలు రెచ్చిపోయి జనం మీద పడి విచ్చలవిడిగా దాడులు చేస్తూ తీవ్రంగా గాయపరుస్తున్నాయి. మండలంలోని స్వర్ణపల్లి, వెంకటాపూర్ గ్రామాల్లో శనివారం కుక్క స్వైర విహారం చేస్తూ దాడులు చేయడంతో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. స్వర్ణపల్లి గ్రామంలో తమ ఇంటి ముం దు ఆడుకుంటున్న నలుబోతుల మానసశ్రీ, కొరవేన వేదాన్స్‌పటేల్ పై, మరో వ్యక్తిపై కుక్కలు విచ్చక్షణరహితంగా దాడి చేశాయి. దీంతో చిన్నారులిద్దరికి పలు చోట్ల తీవ్రంగా గాయాలయ్యాయి. తీవ్ర గాయాలు, రక్తస్రావం అధికం కావడంతో చిన్నారుల, కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. గాయపడ్డ చిన్నారులను చికిత్స కోసం కుటుంబ సభ్యులు మంథనికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం కరీంనగర్ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో గడ్డం మల్లేష్‌తోపాటు అతడి కూతురు శ్రావ్యపై ఇదే కుక్క దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డారు. తొలుత స్వర్ణపల్లి గ్రామంలో పలువురిపై దాడి చేసిన కుక్కను గ్రామస్థులు తరిమివేశారు. పక్కనే ఉన్న వెంకటాపూర్‌కు చేరుకొని తండ్రి కూతురు పై దాడి చేసింది. దీంతో ఆగ్రహించిన గ్రామస్థులు పిచ్చకుక్కను చంపి వేశారు. కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులను మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన చికిత్స అందించాలని వైద్యులను పుట్ట మధు కోరారు. ఇటీవల గ్రామాల్లో యథేచ్ఛగా సంచరిస్తున్న వీధి కుక్కలు చిన్నారులు, అందరి పై దాడులు చేస్తుండటంతో జనం భయాందోళనకు గురవుతున్నారు. వీధి కుక్కల దాడుల నుంచి రక్షించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# పల్లెల్లో అరకొర వైద్య సేవలు

- » సెలవుల్లో వైద్యాధికారి
- » పల్లె దవాఖానాల్లో వైద్యుల కొరత
- » సగానికి పైగా గ్రామాల్లో మొదటి ఏఎన్ఎంలు లైని వైనం
- » సీజనల్ వ్యాధుల బారిన ప్రజలు



మల్యాల ప్రభుత్వ ప్రాథమిక ఆసుపత్రి

మల్యాల, సెప్టెంబరు 14: ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన అన్ని రకాల వైద్య సేవలు అందిస్తున్నామని వైద్యశాఖ పేర్కొంటున్నప్పటికీ వైద్యులు, వైద్య సిబ్బంది కొరతతో గ్రామాల్లో ప్రజలకు అరకొర వైద్య సేవలు అందుతున్నాయి. ప్రస్తుతం సీజనల్ వ్యాధులతో పాటు డెంగ్యూ, చికున్‌గున్యా జ్వరాలతో మండల ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ క్రమంలో పూర్తి స్థాయిలో వైద్య సిబ్బంది స్థానికంగా అందుబాటులో ఉండాల్సి ఉండగా సగం గ్రామాల్లో ఏఎన్ఎంల కొరత నెలకొంది. దానికి తోడు పల్లె దవాఖానాలో వైద్యులు లేకపోగా మల్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు, మండల వైద్యాధికారి సెలవులో వెళ్లారు. దీంతో గ్రామాల్లో వైద్య సేవల పర్యవేక్షణ అంతంత మాత్రమే సాగుతున్నట్లు తెలుస్తుంది. నెల రోజులుగా గ్రామాల్లో జ్వర పీడితుల సంఖ్య పెరిగిపోతుండగా మల్యాలలోని పీహెచ్‌సీకి నిత్యం వందకు పైగా రోగులు వస్తున్నారు. ఈ క్రమంలో వైద్యుల కొరత వైద్య సేవలకు అంతరాయంగా మారుతోంది. దీంతో గ్రామాల్లోని ప్రజలు జగిత్యాల లాంటి పట్టణాలకు వైద్యం కోసం ప్రైవేట్ ఆసుపత్రులకు వెలుతున్నారు. వేలాది రూపాయలు ఖర్చు చేసుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

### అంతరాయం లేకుండా వైద్య సేవలు

వైద్యురాలు సెలవులో ఉన్నప్పటికీ పల్లె దవాఖాన వైద్యులతో రోగులకు ఇబ్బందులు లేకుండా వైద్య సేవలు అందించడం జరుగుతుంది. గ్రామాల్లో ఇద్దరేసి ఏఎన్ఎంలు ఉంటుండగా ఖాళీలు ఉన్న చోట్ల ఒకరు విధుల్లో ఉంటున్నారు. వైద్యుల కొరత దృష్ట్యా పల్లె దవాఖానాల్లో ఖాళీలు ఉన్నాయి. అయినప్పటికీ ప్రత్యామ్నయంగా వైద్య సేవలు కొనసాగుతున్నాయి.

- సమీయోద్దీన్, డీఎంహెచ్‌వో

### ● వైద్యులు లేని పల్లె దవాఖాలు

గ్రామాల్లో ప్రజలకు వైద్యసేవలను మరింత అందుబాటులోకి తేవడంతో పాటు పెద్ద ఆసుపత్రి సేవలను అందించడానికి ఏర్పాటు చేసిన పల్లె దావాఖాల్లో వైద్యుల కొరత నెలకొంది. మండలంలో పోతారం, రాంపూర్, మ్యాడంపల్లి, తక్కళ్లపల్లి, నూకపల్లి గ్రామాల్లో పల్లెదవాఖానాలు ఉండగా తక్కళ్లపల్లి, నూకపల్లిలో వైద్యులు లేరు. ఉన్న ముగ్గురు పల్లె దవాఖాన వైద్యులే మల్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహిస్తున్నారు.తక్కళ్లపల్లిలో స్టాఫ్ నర్స్ ఆధ్వర్యంలో పల్లె దవాఖాన కొనసాగుతుంది. ఇక ఇంటింటికి అందుబాటులో ఉంటూ నిత్యం వైద్య సేవలు అందించే స్టాఫ్ నర్సులు మండల వ్యాప్తంగా 8మంది ఉండగా రాంపూర్, తాటిపల్లి, తక్కళ్లపల్లి, మ్యాడంపల్లి గ్రామాల్లో లేరు. దీంతో రెండవ ఏఎన్ఎం, ఆశ వర్కర్లు వైద్య సేవలు అందిస్తున్నారు. మండల వైద్యాధికారి మౌనిక సెలవులో ఉండగా ప్రాథమిక ఆసుపత్రి పరిధిలో ఒక్క ఆరోగ్య పర్యవేక్షణ అధికారి పోస్టు కూడా ఖాళీ ఉంది. ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

## కొండగట్టులో అంజన్నకు అగ్గిపెట్టెలో ఇమిడే శాలువ


అగ్గిపెట్టెలో పట్టె శాలువ అందజేస్తున్న విజయ్

మల్యాల, సెప్టెంబరు 14: సిరిసిల్లాకు చెందిన చేనేత కార్మికుడు నల్ల విజయ్‌కుమార్ కొండగట్టు ఆంజనేయస్వామికి అగ్గిపెట్టెలో ఇమిడే పట్టు శాలువను అందజేశాడు. శనివారం కుటుంబసమేతంగా అంజన్న సన్నిధికి వచ్చిన విజయ్‌కుమార్ స్వామి వారి దర్శనం అనంతరం ఆలయ అధికారులకు పట్టు శాలువను అందజేశారు. ఈ సం దర్భంగా ఆలయ అర్చకులు ఆశీర్వదించగా అధికారులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకులు హరిహరనాథ్, ధర్మేంధర్ తదితరులు ఉన్నారు.

## శ్రీరాంసాగర్‌కు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

జగిత్యాల, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి శనివారం ఇన్‌ఫ్లో కొనసాగింది. ఎస్సారెస్పీ లోకి 27,315 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులో ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, సాగు నీటి కాలువలు, ఇతర అవసరాలకు 27,315 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

## గణేశ్ నిమజ్జనానికి భారీ బందోబస్తు

సిరిసిల్ల క్రైం, సెప్టెంబరు 14: గణేశ్ నిమజ్జనానికి భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. సిరిసిల్ల పట్టణంలోని బీవైనగర్, జేపీనగర్, పద్మనగర్, సిక్‌వాడ, సంజీవయ్యనగర్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పలు గణేశ్ మండపాలను పరిశీలించి నిర్వాహకులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 2200 వినాయక విగ్రహాలను ఏర్పాటు చేశారన్నారు. సిరిసిల్లలో 400, వేములవాడలో 300, ఆయా మండలాల్లో కలిపి 2200 వినాయక విగ్రహాలు నెలకొల్పారన్నారు. నిమజ్జనోత్సవంలో అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పూర్తిస్థాయి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. భక్తులు, మండపాల నిర్వాహకులు పోలీస్‌వారి సూచలను పాటిస్తూ నిర్దేశించిన సమయానికి నిమజ్జనం పూర్తిచేయాలన్నారు. నిమజ్జనం రోజున ఎట్టిపరిస్థితుల్లో డీజేలకు అనుమతి లేదన్నారు. గణేశ్ మండపాల నిర్వహకులు ఆలస్యం చేయకుండా నిమర్జనం పూర్తిచేయాలన్నారు. శోభాయాత్ర సమయంలో ఇతరుల మనోభావాలు దెబ్బతినెల పాటలు పెట్టినా, బాణాసాంచాలు కాలుస్తు ఇబ్బందులకు గురిచేసిన కఠిన చర్యలు తప్పవన్నారు. మధ్యపానం సేవించి శోభాయాత్రలో ఇతరులకు ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు తప్పవన్నారు. నిమజ్జనం వేడుకల్లో ఎలాంటి గొడవలు, అవాంఛనీయ సంఘటనలు , ప్రమాదాలు జరుగకుండా శాంతియుత వాతావరణంలో శోభాయాత్ర నిర్వహించి పోలీసులకు సహకరించాలన్నారు. డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, టౌన్ సీఐ కృష్ణ, రూరల్ సీఐ మొగిలి పాల్గొన్నారు.

## స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్‌గా శ్రీనివాస్

సిరిసిల్ల క్రైం, సెప్టెంబరు 14: జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్‌గా శ్రీనివాస్‌ను నియమిస్తూ శనివారం ఐజీ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఎస్పీ అఖిల్ మహాజన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

## రాజన్న సేవలో మీనారఘునాథన్

వేములవాడ రూరల్, సెప్టెంబరు 14: తెలంగాణ రాష్ట్ర వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ సభ్యురాలు మీనా రఘునాథన్ వేములవాడ రాజరాజేశ్వర స్వామిని శనివారం దర్శించుకున్నారు. అంతకుముందు రాజన్నకు కోడె మొక్కులు చెల్లించుకున్నారు. స్వామివారి దర్శనం అనంతరం మీనా రఘునాథన్‌కు ఆలయ అర్చకులు వేదోక్త ఆశీర్వచనం, ఆలయ పర్యవేక్షకుడు నర్సయ్య, ప్రోటోకాల్ పర్యవేక్షకుడు అశోక్ స్వామి ప్రసాదాన్ని అందజేశారు.

## వైద్య శిబిరాలకు విశేష స్పందన

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 14: సిరిసిల్ల పట్టణం అంబికానగర్, జేపీనగర్ గణేష్ మండపాల ఆధ్వర్యంలో ఎల్‌వీ ప్రసాద్ ఇన్‌స్టిట్యూట్, రెడ్ క్రాస్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ఉచిత కంటి వైద్య శిబిరం, రక్తదాన శిబి రాలకు విశేష స్పందన లభించింది. మండపాల నిర్వాహకులు పెద్ద సంఖ్యలో రక్తదానం చేయగా, స్థానిక ప్రజలు కంటి వైద్య పరీక్షలు చేయిం చుకున్నారు. ముఖ్యఅతిథి సిరిసిల్ల సీఐ కృష్ణను సన్మానించారు. సిరిసిల్ల అర్బన్ బ్యాంక్ చైర్మన్ లక్ష్మినారాయణ, కౌన్సిలర్ రాజు, మాజీ కౌన్సిలర్ చంద్రకళ, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు దామోదర్, బీజేపీ నాయకుడు వేణు పాల్గొన్నారు.



గంభీరావుపేటలో కుంకుమ పూజలు నిర్వహిస్తున్న మహిళలు





హోమం నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నిర్వాహకులు

# వినాయకా.. విఘ్నాలు తొలగించు

ఇల్లంతకుంట: మండలంలోని వివిధ గ్రామాలలో ఏర్పాటు చేసిన వినాయక మండపాలలో శనివారం ప్రత్యేక పూజలు అన్నదానాలు నిర్వహించారు. మండలకేంద్రంలోని వినాయక మండపాలలో ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ప్రత్యేక పూజలు చేశారు .యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు అంతగిరి వినయ్‌కుమార్, అధికార ప్రతినిధి పసుల వెంకటి పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట : ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో గణేశ్ నవ రాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ప్రత్యేక పూజలు నిర్వహించి ఏకదంతుడిని దర్శించుకున్నారు. అనంతరం అన్నదానం చేశారు ఎల్లారెడ్డిపేట మండలకేంద్రంలోని పద్మశాలి సేవాసంఘం ఆధ్వర్యంలో స్థానిక మార్కండేయ దేవాలయంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద శనివారం 108 రకాల నైవేద్యాలను సమర్పించారు.

గంభీరావుపేట: గంభీరావుపేట మండల కేంద్రంలోని రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి మండపం శనివారం వద్ద సాముహిక కుంకుమ పూజలు నిర్వహించారు. రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ముత్యాల రాజిరెడ్డి తదితరులు ఉన్నారు.

తంగళ్లపల్లి: తంగళ్లపల్లి మండలం ఓల్డ్ అడ్డ మిత్రులు మండపం వద్ద నిర్వహించిన అన్నదానంలో ఎస్ఐ సుధాకర్‌తోపాటు, సహకరించిన మాజీ ఎంపీపీ పడిగెల మానస రాజు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు. ఇందిరమ్మకాలనీ విఘ్నేశ్వర మిత్ర మండలి ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేయగా ఎస్సై, కాంగ్రెస్ సోషల్ మీడియా జిల్లా కో ఆర్డినేటర్ గడ్డం మధుకర్ పాల్గొన్నారు.

వేములవాడ రూరల్: వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో లక్ష్మీగణపతి స్వామిని వివిధ రకాల పండ్లతో అంకరించారు. నాగిరెడ్డి మండపంలో ఏర్పాటు చేసిన వినాయకుడి వద్ద ప్రధాన అర్చకుడు ఉమేష్, ఆలయ అర్చకులు హవనం, హోమం చేశారు. ఆలయ ఈవో వినోద్ రెడ్డి పాల్గొన్నారు.

రుద్రంగి: రుద్రంగి మండల కేంద్రంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు చెన్నమనేని వికాస్ రావు గణేష్ మండపాల వద్ద ప్రత్యేక పూజలు చేశారు.



రుద్రంగిలో వికాస్‌రావును సన్మానిస్తున్న సభ్యులు



ఎల్లారెడ్డిపేటలో 108 రకాల నైవేద్యాలతో పూజలు



తంగళ్లపల్లిలో ఎస్సై, నాయకుల పూజలు



కుంకుమ పూజలో పాల్గొన్న మహిళలు

## మిడ్ మానేరుకు ఇన్ ఫ్లో

బోయినపల్లి, సెప్టెంబరు 14: శ్రీరాజరాజేశ్వర (మిడ్ మానేరు) ప్రాజెక్టులోకి ఎస్సారెస్పీ నుంచి వరద కాలువ ద్వారా 14,830 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వచ్చి చేరుతుండగా, అన్నపూర్ణ రిజర్వాయర్‌కు 6400 క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగుతోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 318 మీటర్లకు ప్రస్తుతం 314.25 మీటర్లు ఉండగా, నీటి నిల్వ సామర్థ్యం 27.54 టీఎంసీలకు గాను ప్రస్తుతం 25. 63 టీఎంసీల మేరకు చేరుకుంది.

## అన్నపూర్ణ రిజర్వాయర్‌కు కొనసాగుతున్న ఎత్తిపోతలు

ఇల్లంతకుంట, సెప్టెంబరు 14:ఇల్లంతకుంట మండలం అనంతగిరి అన్నపూర్ణ రిజర్వాయర్‌కు నీటి ఎత్తిపోలు కొనసాగుతున్నాయి. 3.5 టీఎంసీ సామర్థ్యం ఉన్న రిజర్వాయర్‌లో ప్రస్తుతం 2.86 టీఎంసీలకు చేరుకున్నాయి. మధ్య మానేరు ద్వారా వచ్చిన 6400 క్యూసెక్కుల నీటిని రెండు పంపుల ద్వారా ఎత్తిపోస్తుండగా, రంగనాయకసాగర్‌కు 3300 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

## ఆలయ అర్చకులకు పదోన్నతి



ఉత్తర్వులను అందజేస్తున్న ఈవో వినోద్ రెడ్డి

వేములవాడ రూరల్, సెప్టెంబరు 14: వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో అర్చకులుగా విధులు నిర్వహిస్తున్న బావుసాయిపేట శ్రీనివాస్, చర్లపల్లి బాను ఆలయ ముఖ్య అర్చకులుగా పదోన్నతి పొందారు. ఈ మేరకు ఆలయ ఈవో వినోద్ రెడ్డి శనివారం పదోన్నతి ఉత్తర్వుల కాపీలను అందజేశారు. ఏఈవో శ్రవణ్, పర్యవేక్షకులు పూజిత, సీనియర్ అసిస్టెంట్ మంద స్వామి,పురాణం వంశి, నరేష్, ప్రధాన అర్చకులు పాల్గొన్నారు.

## పీఆర్టీయూ మండల అధ్యక్షుడిగా ప్రదీప్‌రెడ్డి

ఇల్లంతకుంట, సెప్టెంబరు 14:పీఆర్టీయూ టీఎస్ మండల అధ్యక్షుడిగా ఐరెడ్డి ప్రదీప్‌రెడ్డి ఎన్నికయ్యారు. మండలకేంద్రంలో శనివారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో తంగళ్లపల్లి మండల అధ్యక్షుడు సాంబారెడ్డి, ప్రత్యేక అతిథి తూముకుంట మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. ప్రధాన కార్యదర్శిగా గుర్రం సందీప్‌రెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడిగా చెక్కిళ్ల నాగరాజు, ఉపాధ్యక్షులుగా పత్తి వంశీధర్‌రెడ్డి, మంజుల, కార్యదర్శులుగా బాబు, అంకుశావళి, లలిత ఎన్నికయ్యారు.

## సీపీఐ ఆధ్వర్యంలో ఆనందరావుకు నివాళులు

బోయినపల్లి, సెప్టెంబరు 14: తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాల్లో భాగంగా శనివారం బోయినపల్లి మండలం మానువాడలో సీపీఐ ఆధ్వర్యంలో సిరిసిల్ల మొదటి ఎమ్మెల్యే తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట అమరవీరుడు జోగిని పెళ్లి ఆనందరావు స్తూపం వద్ద నివాళులర్పించారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మీసం లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## బెదిరింపులకు పాల్పడిన నలుగురిపై కేసు నమోదు

వేములవాడ, సెప్టెంబర్ 14 : అక్రమంగా 60 గుంటల భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకొని, చంపుతా అని బెదిరించిన నలుగురిపై కేసు నమోదు చేశామని, ఒకరిని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించామని వేములవాడ పట్టణ సీఐ వీరప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. వేములవాడ పట్టణంలోని సాయినగర్‌కు చెందిన మెండ శంకరవ్వ తనకు డబ్బులు అవసరం ఉండడంతో చెక్కపల్లి రోడ్‌లో తనకు ఉన్నటువంటి 60 గుంటల వ్యవసాయ భూమిలో ఒక గుంటను పోగుల శ్రీనివాస్ అనే వ్యక్తికి విక్రయించిందని, పోగుల శ్రీనివాస్ ఒక గుంటకు బదులుగా మొత్తం 60 గుంటల భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకుని ముత్యాల రమేష్ అనే వ్యక్తికి అమ్మాడని సీఐ తెలిపారు. ఈ వ్యవహారంపై శంకరవ్వ కోర్టులో కేసు వేసిందన్నారు. విషయం తెలుసుకుని కడారి తిరుపతి అనే వ్యక్తి ఆమె వద్దకు వచ్చి చంపుతానని బెదిరించాడని, బలవంతంగా సంతకాలు తీసుకున్నాడని పేర్కొన్నారు. అతడి తమ్ముడు కడారి మహేందర్ పేరు మీద 60 గుంటల భూమిని డబుల్ రిజిస్ట్రేషన్ చేసుకొని అందులో ప్లాట్లు చేసి ఇతరులకు విక్రయిస్తుండగా శంకరవ్వ నిలదీసిందని తెలిపారు. నీకు భూమి ఎక్కడిదని బెదిరించి ఇక్కడికి వస్తే చంపుతానని బెదిరించారని సీఐ వివరించారు. ఈ ఘటనపై శంకరవ్వ ఫిర్యాదు మేరకు పోగుల శ్రీనివాస్, ముత్యాల రమేష్, కడారి తిరుపతి, కడారి మహేందర్‌పై కేసు నమోదు చేశామని, ఇందులో కడారి తిరుపతిని రిమాండ్ కి తరలించామని, ముగ్గురు నిందితులు పరారీలో ఉన్నారని వివరించారు.

## పలువురి పరామర్శ

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 14: ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌కు చెందిన దినపత్రిక విలేకరి నిమ్మ బాల్‌చందర్ రెడ్డిని పలువురు పరామర్శించారు. అయన తండ్రి నారాయణరెడ్డి శనివారం అనారోగ్యంతో మృతిచెందారు. సీఎం పీఆర్‌వో బొల్లం శ్రీనివాస్, కేంద్ర సాహిత్య అవార్డు గ్రహిత నలిమెల భాస్కర్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్ రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య పరామర్శించారు.

# దేశ అభివృద్ధి కోసం బీజేపీని బలోపేతం చేద్దాం



సభ్యత్వ నమోదులో ప్రతాప రామకృష్ణ

వేములవాడ, సెప్టెంబర్ 14 : దేశ అభివృద్ధి కోసం బీజేపీని మరింత బలోపేతం చేద్దామని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ అన్నారు. బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం శనివారం వేములవాడ పటణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ పట్టణ అధ్యక్షుడు, మున్సిపల్ కౌన్సిలర్ రేగుల సంతోష్ బాబు, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు మహేష్ తదితరులకు బీజేపీ సభ్యత్వాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ప్రతాప రామకృష్ణ మాట్లాడుతూ బీజేపీ ప్రపంచంలోనే అతి పెద్ద రాజకీయ పార్టీ అని, దేశ ప్రజల మద్దతుతో ఇప్పటికి మూడు పర్యాయాలు కేంద్రంలో అధికారంలోకి వచ్చిందని అన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున్, నాయకులు హనుమండ్లు, అక్కపెల్లి వివేక్ రెడ్డి, వేములవాడ రూరల్ మండల పరిషత్ మాజీ అధ్యక్షుడు మల్లేశం, మనోజ్, రాజ్ కుమార్, షైలారం శ్రీనివాస్, బాలరాజు, లక్ష్మన్, నామాల శేఖర్, మామిండ్ల లక్ష్మిరాజం, రంజిత్ రెడ్డి, రేగుల శ్రీకాంత్, కృష్ణ, అన్నం నర్సయ్య, సగ్గు రాహుల్ పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆ పార్టీ నాయకులు శనివారం ప్రారంభించారు. బీజేపీ నాయకులు సంతోష్‌రెడ్డి, శ్రీనివాస్‌రావు, తిరుపతి పాల్గొన్నారు.

**చందుర్తి :** చందుర్తి మండలకేంద్రంలో బీజేపీ సభ్యత్వ నమోదును ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొక్కు దేవేందర్ యాదవ్ ప్రారంభించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమేష్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాస్, అసెంబ్లీ కన్వీనర్ సత్తయ్య పాల్గొన్నారు.

**కోనరావుపేట:** మండల కేంద్రంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డి గోపి నాయకులు గొట్టె రామచంద్రం, మిరియాల్‌కార్ బాలాజీ, జింక వెంకటి, రవీందర్ గౌడ్, అనిల్, మోత్కు మోహన్, కూస సురేష్, బెంద్రె శ్రీనివాస్ రెడ్డి, బైరగోని సురేష్ పాల్గొన్నారు.

**రుద్రంగి:**రుద్రంగి మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో శనివారం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు చెన్నమనేని వికాస్‌రావు మాట్లాడారు. దేశంలోనే బీజేపీ ఎక్కువ సభ్యత్వాలు కలిగి ఉందన్నారు. సెస్ మాజీ చైర్మన్ అల్లాడి రమేష్, బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు నంద్యాడపు వెంకటేష్, బీజేపీ మండల అధ్యక్షుడు అల్లూరి అశోక్ రెడ్డి పాల్గొన్నారు.



సభ్యత్వం అందజేస్తున్న చెన్నమనేని వికాస్‌రావు

# కొద్ది మంది కోసం మాత్రమే పనిచేసిన బీఆర్ఎస్ ప్రభుత్వం

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 14: గత ప్రభుత్వం వస్త్ర పరిశ్రమలో కొద్ది మంది కోసం మాత్రమే పని చేసిందని కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. శనివారం సిరిసిల్ల పట్టణం ఆ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సిరిసిల్ల పట్టణంలో పద్మశాలీ సోదరులకు ఏదైన లబ్ధి చేకూరిందంటే కేవలం కాంగ్రెస్ ద్వారానే అన్నారు. గత ప్రభుత్వం ఓటు బ్యాంకు రాజకీ యాల కోసం తాత్కాలి ఉపశమనం ఇచ్చి, బతు కమ్మ చీరల బకాయిలను ఎగ్గొట్టి, కరెంట్‌ను కూడా 4వ కేటగిరి నుంచి 3వ కేటగిరికి మార్చి కష్టాలు పెట్టిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న నేతన్నలకు ఆదుకోవాలని ముఖ్యమంతి రేవంత్‌రెడ్డి గత ప్రభుత్వం ఇచ్చిన ఆర్డర్ల కంటే రెండింతలు 8కోట్ల మీటర్ల చీరలకు ఆర్డర్లను ఇస్తున్నారన్నారు. పరిశ్రమలో ఉన్న మెళకువలను కూడా రానున్న తరాలకు అందించాలని నేషనల్ ఇనిస్టూట్ ఆఫ్ హాండ్లూం టెక్స్‌టైల్ యూనివర్శిటీని ప్రారంభించారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు కావాల్సి యారన్ బ్యాంక్‌ను ఇక్కడికి తీసుకరావడానికి, బ్యాంక్ లింకేజీలు కూడా ఇవ్వడానికి సిద్ధంగా ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం నూలుపైన జీఎస్టీ విధిస్తే కేంద్రం ప్రభుత్వ సహాయ మంత్రిగా ఉన్న వ్యక్తి జీఎస్టీని ఎత్తివేయడంపై ఎలాంటి చర్యలు తీసేకోకుండా బతుకమ్మ బకాయిల ఇవ్వాలని మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. సిరిసిల్ల పద్మశాలి సోదరులు సమస్యలు చెప్పుకుందామంటే ఇక్కడి ఎమ్మెల్యే అందుబాటులో ఉండడం లేదన్నారు. పార్టీ ఫిరాయింపుల కేసుల్లో న్యాయస్థానాల తీర్పును గౌరవిస్తామన్నారు. కౌశిక్‌రెడ్డి శాసన సభ్యుడా కాదా అనేది ఆయన మనస్సాక్షికి చెప్పుకోవాలన్నారు. ఈ నెల 16న సిరిసిల్ల పట్టణం షాదీఖానాలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్ ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రి సౌజన్యంతో నిర్వహిస్తున్న వైద్య శిబిరాన్ని విజయవంతం చేయా లని కోరారు. కాంగ్రెస్ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, పీసీసీ మాజీ కార్యదర్శి గడ్డం నర్సయ్య, నాయకులు వైద్య శివప్రసాద్, భాను, చేనేత వస్త్ర వ్యాపార సంఘం అధ్యక్షుడు తాటిపాముల దామోదర్ నాయకులు పాల్గొన్నారు.



సిరిసిల్లలో మాట్లాడుతున్న కేకే మహేందర్‌రెడ్డి

## విఘ్నేశ్వరుని ఆశీస్సులు అందరిపై ఉండాలి

బోయినపల్లి సెప్టెంబరు 14 : ఆ విఘ్నేశ్వరుని ఆశీస్సులు, చల్లని దీవెనలు అందరిపై ఉండాలని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. బోయినిపల్లి మండల కేంద్రంలో హనుమాన్ నగర్‌లో గణపతి నవరాత్రుల సందర్భంగా బీఆర్ఎస్ నాయకులతో కలిసి పూజలు చేశారు. మాజీ సర్పంచులు గుంటి శంకర్, చిందం రమేష్, కొప్పుల మల్లేశం, మాజీ మండల కో- ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

## రేపు ఉచిత క్యాన్సర్ నిర్ధారణ వైద్య శిబిరం

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 14: సిరిసిల్ల పట్టణం షాదీ ఖానాలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్ ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత క్యాన్సం నిర్ధారణ వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వసంతరావు ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు వైద్య శిబిరం నిర్వహిస్తామని 25 సంవత్సరాలు పైబడిన మహిళలు వైద్య పరీక్షలు చేయించుకోవచ్చునని పేర్కొన్నారు.

## విద్యుదాఘాతంతో వానరం మృతి

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 14: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లో వానరం ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో శనివారం మృత్యువాత పడింది. సుమారు రెండు గంటలపాటు కరెంటు సరఫరాకు అంతరాయం ఏర్పడింది. మృత్యువాత పడిన వానరాన్ని తొలగించిన సెస్ అధికారులు మరమ్మతు పనులు చేపట్టారు. అనంతరం విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

## బీడీ కార్మికుల డిమాండ్లు నెరవేర్చాలి

మెట్‌పల్లి, సెప్టెంబర్ 14(ఇబ్రహీంపట్నం): తమ డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరుతూ శ్రామిక శక్తి తెలంగాణ బీడీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బీడీ కార్మికులు పట్టణంలోని పాత బస్టాండ్ నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షురాలు లక్ష్మీ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీడీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. రాష్ట్రం ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం బీడీ కార్మికులకు వెంటనే 4 వేల పెన్షన్ ఇవ్వాలని అన్నారు. పీఎఫ్‌కు కటాఫ్ డేట్ లేకుండ ప్రతి ఒక్క బీడీ కార్మికురాలికి పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. విరమణ పొందిన కార్మికులకు 7 వేల పెన్షన్ ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వానికి విన్నవించారు. కార్మికులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించాలని కోరారు.

## సీతారాం ఏచూరి ఆశయాలను కొనసాగిద్దాం

సిరిసిల్ల రూరల్, సెప్టెంబరు 14 : దేశం గర్వించదగిన మేధావి సీపీఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి మరణం దేశానికి తీరని లోటని, ఆయన ఆశయాలను కొనసాగించేందుకు ముందుకుసాగాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మంద అనిల్‌కుమార్, ఉపాధ్యక్షుడు కుర్ర రాకేష్ అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని బీసీ కళాశాల బాలుర హాస్టల్‌లో శనివారం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఏచూరి ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘంలో పనిచేసి జాతీయ అధ్యక్షుడిగా జేఎన్‌టీయూ అధ్యక్షుడిగా మూడుసార్లు సీపీఎం జాతీయ కార్యదర్శిగా, పార్లమెంట్ సభ్యుడిగా ఎన్నో సేవలు అందించారన్నారు. ఎస్ఎఫ్ఐ నాయకులు చిగుర్ల అనిల్, మహే ష్, లోకేష్, నవీన్ విద్యార్థులు పాల్గొన్నారు.

**చందుర్తి :** చందుర్తి మండల కేంద్రంలో సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారం ఏచూరికి సీపీఎం మండల నాయకులు శనివారం నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ నాయకులు ఎగుమంటి ఎల్లారెడ్డి, మండల అధ్యక్షులు మల్యాల నర్సయ్య, మాడి నరేష్, లక్ష్మీ బాబు, ఈదుల మల్లేశం, ప్రశాంత్, రాజు అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

**కోనరావుపేట:** సీపీఎం ప్రధాన కార్యదర్శి, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి సీతారాం ఏచూరి అనారోగ్యంతో మృతి చెందగా కోనరావుపేట మండల కేంద్రంలో సీపీఎం ఆధ్వర్యంలో శనివారం నివాళులర్పించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. సీపీఎం నాయకురాలు జవ్వాజి విమల తదితరులు పాల్గొన్నారు.

# గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవాలి



ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

సిరిసిల్ల,(ఆంధ్రజ్యోతి)/గంభీరావుపేట/వేములవాడరూరల్, సెప్టెంబరు 14 : గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవాలని, అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అన్నారు. గంభీరావుపేట మండలం లింగన్నపేట ప్రభు త్వ ఆరోగ్య కేంద్రాన్ని శనివారం తనిఖీ చేశారు. ఆసుపత్రిలో ప్రారంభమైన ఎనీమియా నిర్ధారణ పరీక్షల ప్రత్యేక శిబిరాన్ని పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రక్తం తక్కువ ఉన్న వారు మందులు, పండ్లు, డ్రైఫ్రూట్స్ తీసుకోవాలన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని జిల్లా సంక్షేమ శాఖ అధికారి పి.లక్ష్మీరాజం అన్నారు. వేములవాడ పట్టణంతోపాటు మారుపాక, లింగంపల్లి, హనుమాజీపేట, బొల్లారం, మంగళపల్లి గ్రామాల్లో పోషణ మాసం కార్యక్రమంలో భాగంగా శనివారం పర్యటించారు.ఏసీడీపీవో సుచరిత, ఐసీడీఎస్ సూపర్ వైజర్ అంజమ్మ, డీహబ్ కోఆర్డినేటర్ రోజ, సఖి కౌన్సిలర్ సుమలత, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

రాష్ట్రీయ పోషణమాసంలో భాగంగా స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శనివారం సిరిసిల్లలోని సుభాష్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలు, పిల్లలకు రక్తహీనతపై రక్త పరీక్షలు నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పౌష్టికాహారంపై ప్రదర్శన నిర్వహించారు. రక్తహీనతకు అధిగమించడానికి ఆహార పదార్థాలు తీసుకునే విధానంపై అవగాహన కల్పించారు. ఆకుకూరలు, చిక్కుడు జాతి విత్తనాలు, మొలకెత్తుతున్న విత్తనాలు, చికెన్, ఫిష్, స్థానికంగా లభించే కూరగాయలు, రాగులు, జొన్నలు, మిల్లెట్స్ వంటి వాటిపై అవగాహన కల్పించారు. ఏసీడీపీవో జ్యోతి, ఆర్‌బీఎస్‌కే మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నయూమా, ఏబీనగర్ మెడికల్ అధికారి డాక్టర్ కృష్ణవేణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దివ్య, అంగన్‌వాడీ టీచర్లు శాంత, అంజని, విజయ, విజయలక్ష్మీ, పద్మ, కౌన్సిలర్ దేవదాస్, ఏఎన్ఎం చైతన్య, ఆశా వర్కర్లు గీత, బాలలక్ష్మీ, రమ, అనిత, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది రాజగోపాల్, ప్రోగ్రాం ఆఫీసర్ అంజలి పాల్గొన్నారు.

**వీర్నపెల్లి:** చిన్నారులు, గర్భిణులు, పోషకాహారంతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని, తద్వారా ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్ వైజర్ సంతోషిణి అన్నారు. మండల కేంద్రంలో పోషణ సందర్భంగా శనివారం అవగాహన సదస్సును నిర్వహించారు. ఎంఎల్‌పీహెచ్ చైతన్య పాల్గొన్నారు.

**ముస్తాబాద్:** రక్తహీనతను అధిగమించేందుకు అందరు కృషి చేయాలని ముస్తాబాద్ మండల వైద్యధికారి బత్తుల గీతాంజలి పేర్కొన్నారు. మండలంలోని పోతుగల్, గూడెం, ఆవునూర్, బందనకల్, చీకోడ్, నామాపూర్, తెర్లుమద్దిలో రక్తహీ నతపై పరీక్షలు నిర్వహించారు.

**చందుర్తి :** చందుర్తి మండల కేంద్రంతోపాటు రామన్నపేట, తిమ్మాపూర్ గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం పోషణ్ అభియాన్ నిర్వహించారు. ఐసీడీఎస్ సీడీపీవో సౌందర్య, సూపర్‌వైజర్ శంకరమ్మ తదితరులు పాల్గొన్నారు.



సిరిసిల్లలో రక్త పరీక్షలు చేస్తున్న సిబ్బంది